క్లుప్తంగా

గృహ నిర్మాణ లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ


హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ లత

వీరఘట్టం: ప్రధాన మంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన పథకంలో భాగంగా గృహ నిర్మాణాలు చేపడుతున్న వారి ఖాతాల్లో నగదు జమ అయినట్లు హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ భోగి లత గురువారం తెలిపారు. మండలానికి సంబంధించి, మొత్తం 265 మంది లబ్ధిదారులు ఉన్నారని, ఒక్కొక్కరికి నిర్మాణాలు చేపట్టేందుకు రూ.5 వేలు, పునాది స్థాయిలో ఉన్న వారికి రూ.35 వేలు, శ్లాబు స్థాయిలో ఉన్న వారికి మరో రూ.35 జమ చేసినట్లు పేర్కొన్నారు.

నియామకపత్రాలు అందజేత


నియామకపత్రాలతో వలంటీర్లు

వీరఘట్టం: ఎంపీడీఓ కార్యాలయంలో బిటివాడ, చిదిమి, చిట్టపులివలస, హుస్సేన్‌పురం, మూలలంక, పాలమెట్ట, వీరఘట్టం ప్రాంతాలకు ఎంపికైన ఎనిమిది మంది వలంటీర్లకు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు గురువారం నియామకపత్రాలు అందజేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు మీరేనని, చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: త్వరితగతిన మనబడి నాడు–నేడు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పైడితల్లి, ఎస్.ఎస్.ఏ ఇంజినీరింగ్ అధికారి రామారావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ శివాజీ

గుమ్మలక్ష్మీపురం: అనారోగ్యం రీత్యా విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన వృద్ధుడు బర్నికల కుమారస్వామికి ఆ గ్రామ వలంటీర్ శివాజీ గురువారం ఆస్పత్రికి వెళ్లి మరీ పెన్షన్ అందజేశారు. సదరు వలంటీర్ సేవాభావాన్ని గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు.

పిల్లలకు విజ్ఞానం, వినోదం, వికాసం అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న రచయిత గంటేడ గౌరునాయుడు

పార్వతీపురంటౌన్: పిల్లలకు విజ్ఞానం, వినోదం, వికాసం అవసరమని అది చుట్టూ ఉన్న సమాజంలో కరువైందని కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం ఐద్వా, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేసవి వినోదం పేరుతో పట్టణంలోని ఏర్పాటు చేసిన చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ సరళీకరణ విధానాల అభివృద్ధిలో పిల్లలే సూత్రధారులుగా నిలుస్తున్నారన్నారు. వారి మనసులను ఆకట్టుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పుస్తకాల కన్నా సెల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లపై చిన్నారులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని, మరికొంత మంది పిల్లలు వారి జీవనం, కుటుంబ పరిస్థితి వల్ల చెడు అలవాట్లకు గురవుతున్నారన్నారు. పిల్లల్లో చైతన్యం కల్పించి వాటన్నింటికీ దూరంగా ఉండేలా కృషిచేయాలన్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం


ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పాలవలస రాజశేఖరం

పాలకొండ: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా నమ్ముతున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం అన్నారు. గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు మండల కేంద్రంలోని ఆయన నివాసానికి విచ్చేసిన రాజాం, పాతపట్నం, బొబ్బిలి ఎమ్మెల్యేలు కంబాల జోగులు, రెడ్డి శాంతి, శంబంగి చినవెంకట అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, మూలపేట పోర్టు నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేసి, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదేనన్నారు. ఇంత మంచి ప్రభుత్వాన్ని తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో చూడలేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ విజయ దుందుభి మోగించడం ఖాయమన్నారు.

భక్తిశ్రద్ధలతో ఘటాల తిరువీధి


పట్టణ వీధుల్లో పైడితల్లి అమ్మవారి ఘటాల తిరువీధి

వీరఘట్టం: స్థానిక పట్టణంలో పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఘటాల తిరువీధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోయిడు ఇంటి వద్ద నుంచి బయలుదేరిన ఘటాలు లెంక, సెగిడి, కొండ, గెంబలి, నక్క, బార్నాల వీధులతో పాటు సాయినగర్ కాలనీ మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నాయి. అక్కడ భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు


ట్రాక్టరుతో రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

వీరఘట్టం: స్థానిక ప్రధాన రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.5.50 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన కాలువలపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రోడ్డును కూడా చదును చేస్తున్నారు. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు.

నేత్ర శస్త్రచికిత్సకు 59 మంది ఎంపిక


మహిళ కంటిని పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్ జాక్సన్

వీరఘట్టం: మండలంలోని వండవ జంక్షన్‌లో ఉన్న షిర్డీసాయి ధ్యాన మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి హాజరైన 102 మందికి ఆప్తాలమిస్ట్ జాక్సన్ కంటి పరీక్షలు చేసి, 59 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. శిబిరానికి వచ్చిన వారందరికీ ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం భోజన వసతి కల్పించారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహం


చింతపండు ప్రోసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గుమ్మలక్ష్మీపురం సమీపంలో ఏర్పాటు చేసిన మన్యం మిత్ర చింతపండు ప్రోసెసింగ్ యూనిట్‌ను ఆమె గురువారం సందర్శించారు. చింతపండు పిక్క తీసి, కేకులు తయారు చేస్తున్న విధానం పరిశీలించి, నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు మళ్లించి, వారికి జీవనోపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ రుణాలు సద్వినియోగం చేసుకుని, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, మండ సర్పంచ్ నిమ్మక హైమావతి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


వేతనదారులకు సూచనలు చేస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు


వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: మండలంలోని మల్లికాలనీ, కుశిమి పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ సత్యం గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనిచేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు. సిబ్బంది కూడా పనిలోకి వచ్చిన వారికి మస్తరు వేయాలన్నారు. బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటరాజపురం, ఎం.హరిపురం గ్రామస్తులు గౌరీసాగరం చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. వేతనదారులతో రెండు పూటలా పనులు చేయించాలని సిబ్బందికి తెలిపారు. పనిలోకి రాని వారికి మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయించి, రోజుకు రూ.257 వేతనం వచ్చేలా చూడాలన్నారు.

లోకోస్ యాప్‌పై వీఓఏలకు శిక్షణ


జియ్యమ్మవలస: లోకోస్ యాప్ వినియోగంపై వీఓఏలకు శిక్షణ ఇస్తున్న ఏపీఎం వెంకట్, సీసీలు


గరుగుబిల్లి: శిక్షణ తీసుకుంటున్న వీఓఏలు

గరుగుబిల్లి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో లోకోస్ యాప్ వినియోగంపై వీఓఏలకు గురువారం శిక్షణ ఇచ్చే కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. దీనిలో మహిళా సంఘాల వివరాలను సమగ్రంగా పొందుపరిచేందుకు కేంద్రం ఈ యాప్‌ను తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు వీఓఏలకు శిక్షణ ఇచ్చి, ఎస్ఆర్ఎల్ఎం సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల వివరాలు యాప్‌లో పొందుపరుస్తారు. కార్యక్రమంలో సీసీ చందాన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: స్థానిక పట్టణంలోని వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్ వినియోగంపై వీఓఏలకు శిక్షణ ఇస్తున్నారు. దాదాపు 4 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణ కార్యక్రమంలో యాప్ వినియోగం, దానిలో మహిళా సంఘాల వివరాలను పొందుపరచడం వంటి విషయాలు తెలియజేయనున్నామని వెలుగు ఏపీఎం వెంకట్ తెలిపారు. ఆధార్, ఫోన్, అకౌంట్ నంబర్‌తో పాటు ఇన్సూరెన్స్ ఉందా లేదా అనే 8 రకాల వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీలు బాలకృష్ణ, పార్వతి, వీఓఏలు బాబూరావు, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమరాడ: మండలంలోని కొమరాడ, గంగారేగువలస సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గొర్లి వెంకటరమణ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా కలుగుతున్న ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, బాధిత గ్రామాల ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

నాన్ టింబర్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ

సీతంపేట: మండల కేంద్రంలోని వైటీసీలో నాన్ టింబర్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. దాదాపు 50 రోజుల పాటు పల్సస్ కల్టివేటర్ శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–34 సంవత్సరాల వయసు మధ్య ఉన్న వారు శిక్షణకు అర్హులని, ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా పదో తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు వైటీసీ మేనేజర్ ఫోన్ నంబర్ 7032060773ను సంప్రదించాలన్నారు.

వేసవి క్రీడాశిక్షణ ప్రారంభం


అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ రామకృష్ణ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక పట్టణంలోని హెచ్ గ్రౌండ్‌లో వేసవి క్రీడాశిక్షణ గురువారం ప్రారంభమైంది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రన్నింగ్, వ్యాయామం విభాగాల్లో ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణను విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోచ్ బంగారి రామకృష్ణ కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఈ నెల 30వ తేదీన సర్టిఫికెట్లు కూడా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామికి పంచామృతాభిషేకం



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో భక్తులు గురువారం పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివారి పర్వదినం కావడంతో వందలాది మంది భక్తులతో అభిషేకాలు గావించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కోరిన కోర్కెలు తీరుతాయన్న ఆశతో పూజలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే సంతానం లేనివారు ప్రత్యేక పూజలు చేయడం వల్ల సంతాన ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకం భక్తులకు ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తారని తెలిపారు. దూర ప్రాంతాలనుంచి ఆలయానికి వచ్చి అభిషేకంలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

విస్తృతంగా అటవీ ఉత్పత్తుల కొనుగోలు


గొడౌన్ సిబ్బంది నుంచి గిరిజన ఉత్పత్తుల వివరాలు సేకరిస్తున్న జీసీసీ ఎండీ సురేష్‌కుమార్

సీతంపేట: గిరిజనులు సేకరించిన నాణ్యమైన అటవీ ఉత్పత్తులను విస్తృతంగా కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రానికి విచ్చేసిన ఆయన దోనుబాయి, మానాపురం, అడ్డాకులగూడ ప్రాంతాల్లో పర్యటించి, అక్కడి మైనర్ ఫారెస్ట్ ప్రొడక్ట్స్ గొడౌన్‌లను పరిశీలించారు. అనంతరం అక్కడి సేల్స్‌మెన్‌లకు పలు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించి, ఇంతవరకు కొనుగోలు గిరిజన ఉత్పత్తులు ఏమేమి ఉన్నాయని అడగ్గా, చింతపండు, నరమామిడి చెక్క, కొండచీపుళ్లు ఉన్నాయని వారు సమాధానమిచ్చారు. గొడౌన్‌లు ఎప్పుడూ తెరిచి ఉంచి, ప్రజలకు గిరిజన ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం అడ్డాకులగూడలో కొత్తగా గొడౌన్ నిర్మించేందుకు అంచనాలు రూపొందించి, పంపించాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట జీసీసీ డీఎం సంధ్యారాణి, మేనేజర్ గొర్లె నరసింహులు ఉన్నారు.

పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు


బత్తిలి గ్రామం దగ్గర నుంచి పొలాలకు హద్దురాళ్లు తరలిస్తున్న కూలీలు

భామిని: భూముల రీసర్వే పూర్తయిన చోట్ల పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు చేపట్టాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు సూచించారు. మండలంలోని బత్తిలి గ్రామ సరిహద్దులో ఉన్న జిరాయితీ పొలాల్లో గురువారం హద్దురాళ్ల ఏర్పాటు చేశారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేపట్టాలన్నారు. రైతులు సహకరిస్తే సర్వే మరింత వేగవంతమవుతుందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, సర్వేయర్ తోట రామ్మోహన్‌రావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ


అట్రాసిటీ కేసుపై విచారణ జరుపుతున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ స్పెషల్ డీఎస్పీ మురళీధర్

భామిని: మండలంలోని చిన్నదిమిలి గ్రామంలో నమోదైన అట్రాసిటీ కేసుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పార్వతీపురంమన్యం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ స్పెషల్ డీఎస్పీ మురళీధర్ గురువారం విచారణ చేపట్టారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ విచారణలో అట్రాసిటీ కేసు నమోదుకు కారణమైన భూ వివాదానికి సంబంధించిన, ఇరు వర్గాలతో సదరు అధికారులు మాట్లాడారు. వివాదానికి గల కారణాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, బత్తిలి ఎస్ఐ అమ్మనరావు పాల్గొన్నారు.

తాగి పట్టుబడితే జైలుకే..


వాహనాదారుడికి డ్రంక్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ అమ్మనరావు

భామిని: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకేనని బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు హెచ్చరించారు. భామిని, బత్తిలి ప్రాంతాల్లో గురువారం వాహన తనిఖీలు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా మద్యం మత్తులో జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

గిరిజన గూడల్లో అధికారుల దర్యాప్తు


బంద్రసింగి గూడలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో ఉన్న గిరిజన గూడల్లో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇటీవల సీతంపేట మండల కేంద్రంలో జరిగిన స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో తివ్వాకొండల్లోని రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 12 గిరిజన గూడలకు చెందిన వారు తమ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఆయా ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు వారు ఎంతకాలం నుంచి అక్కడ ఉంటున్నారు, గతంలోని ప్రభుత్వాలు అక్కడ ఏయే మౌలిక సదుపాయాలు కల్పించారన్న అంశాలపై ఆరాతీశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణమూర్తి, వీఆర్‌ఓలు గోపాల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రామమందిరం నిర్మాణానికి భూమిపూజ


రామమందిరం నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేటలో రామమందిరం నిర్మాణానికి సర్పంచ్ గార్ల సుజాత, కళింగ వైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొదంగొళ్ల గౌరీశంకరరావు కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఆయల నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మొత్తం రూ.60 లక్షలతో మందిరం నిర్మిస్తున్నామని, విరాళాల సేకరణ కూడా జరుగుతోందని, తూరుబిల్లి ఆనందరావు రూ.5 లక్షల విరాళం ప్రకటించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బరాటం గుంపస్వామి, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు


బెజ్జిలో హద్దురాళ్ల ఏర్పాటును ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: భూముల రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని బెజ్జి గ్రామపంచాయతీ సర్పంచ్ శివ్వాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బెజ్జి గ్రామ పొలాల్లో హద్దురాళ్ల ఏర్పాటును గురువారం ఆయన ప్రారంభించారు. పక్కాగా సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరుగుతోందని, దీంతో ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు రైతుల సమక్షంలోనే సర్వే జరిగేలా చూడాలని, రైతులు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు.

చురుగ్గా ఈకేవైసీ నమోదు


ఈకేవైసీ నమోదు చేసుకుంటున్న విశ్రాంత ఉద్యోగులు

సీతంపేట: స్థానిక గ్రామ సచివాలయంలో పాలకొండ సబ్‌ట్రెజరీ కార్యాలయం ఆధ్వర్యంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా కొనసాగుతోంది. మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సెక్రటరీ కె.ఎస్.విల్సన్‌బాబు, జి.రామకృష్ణ, బి.సావిత్రి, ఎస్.జంగం, పి.జోగులు ఈకేవైసీ నమోదు చేసుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారంతా ఈకేవైసీ చేయించుకునేందుకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏటీఓ రమణమూర్తి, ఎస్‌టీఓ భాస్కరరావు కోరారు.